క్లుప్తంగా

ప్రజలకు అందుబాటులో ఉంటా

– ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

తంబళ్లపల్లె : నియోజకవర్గ ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన స్వగృహంలో పలు మండలాల నుంచి వచ్చిన నాయకులు, కార్యకర్తలతో సాధారణ ఎన్నికలు జరిగిన తీరుపై ఓటింగ్ సరళిపై ఆరా తీశారు. వైఎస్సార్‌సీపీ విజయానికి ఢోకాలేదని మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు.

నేటి నుంచి మారెమ్మ తిరునాల

కురబలకోట : మండలంలోని అంగళ్లు గ్రామం మొలకవారిపల్లెలో గురు, శుక్రవారం రెండు రోజులు మారెమ్మ తిరునాల నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ప్రతి ఏటా మొలకలపౌర్ణమి సందర్భంగా ఇక్కడ తిరునాల జరుపుతారు. గురువారం రాత్రి దీలు, బోనాలు, కోలాటం, చెక్కభజన, జాగీర్లుతో పాటు చాందినీ బండ్ల మెరువన వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం నుండి ఉట్లమాను ఉత్సవం కనుల పండుగలా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ముస్లిం హక్కుల పరిరక్షణ సమితీ జిల్లా అధ్యక్షుడిగా ఫారుఖ్



వాల్మీకిపురం : ముస్లిం హక్కుల పరిరక్షణ సమితీ జిల్లా అధ్యక్షుడిగా వైఎస్సార్‌సీపీ నాయకుడు ఫారుఖ్‌ను నియమించినట్లు ఆ సమితీ రాష్ట్ర అధ్యక్షులు నాగుల్ మీరా తెలిపారు. బుధవారం చింతపర్తిలో ఏర్పాటు చేసిన ముస్లిం మైనార్టీల సమావేశంలో ఆయన నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఫారుఖ్ మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో ముస్లిం హక్కులను పరిరక్షించడంతో పాటు ముస్లింల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. జిల్లా అధ్యక్షులుగా ఎంపికైన ఫారుఖ్‌ను స్థానిక ముస్లిం మతపెద్దలు, ముస్లిం నాయకులు అభినందించారు.

ఏ సంస్థకైనా హెచ్‌ఆర్ వెన్నెముక

కురబలకోట : సంస్థలు, వ్యవస్థలు, కంపెనీలు తదితర వాటి పురోగతికి హెచ్‌ఆర్ (మానవవనరులు) వెన్నెముకలాంటివని అంగళ్లులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల డీన్ శ్రీమంతబసు అన్నారు. అంతర్జాతీయ హెచ్‌ఆర్ దినోత్సవ సందర్భంగా కళాశాలలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ హెచ్‌ఆర్ సమర్థత, భవిష్యత్ ప్రణాళికల ప్రకారం ఏ సంస్థ అభివృద్ధి అయినా ఆధారపడి ఉంటుందన్నారు. కొత్తవారిని చేర్చుకోవడం వారిలో నైపుణ్యాన్ని పెంచడం ద్వారా సంస్థ ప్రగతికి పనిచేస్తారన్నారు. పోటీ ప్రపంచంలో సంస్థ లక్ష్యాలను విజయవంతంగా నిర్వహించడంలో కీలక పాత్ర పోషిస్తాయన్నారు. ఉద్యోగులకు సంస్థకు మధ్య వారధిగా వుంటూ వారి ఎదుగుదలలో క్రియాశీలకంగా వ్యవహరిస్తారన్నారు. ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ గీతాదేవి, ప్రొఫెసర్ డాక్టర్ డి. ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విత్తన కాయలను సద్వినియోగం చేసుకోండి

వాల్మీకిపురం : ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వేరుశనగ విత్తన కాయలను ప్రభుత్వం పంపిణీ చేస్తుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏవో హేమలత తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో 1730 క్వింటాళ్ల వేరుశనగ విత్తన కాయలు కేటాయించిందని, ఆయా పంచాయతీల్లోని రైతు భరోసా కేంద్రాల్లో రైతులు తమ పేర్లను రిజిస్టర్ చేయించుకోవాలన్నారు. రైతులు తమ పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్‌కార్డు, మొబైల్ ఫోన్ తీసుకెళ్లి నమోదు చేసుకోవాలన్నారు. 30 కిలోల కె6 రూ.1710, 30కిలోల నారాయణి రకం రూ.1746 అని తెలిపారు.

మీసేవా కేంద్రాలు తనిఖీ

రామసముద్రం : మండలంలోని పెద్దకురప్పల్లె, మినికి, చెంబకూరు మీసేవ కేంద్రాలను బుధవారం డీఎల్‌డీఓ లక్ష్మీపతి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మీసేవ ఆపరేటర్లకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఆదాయ, కుల సర్టిఫికెట్లు, పట్టాపాసుపుస్తకాల కొరకు వచ్చే రైతులు, విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన షరతుల మేరకు రుసుము తీసుకోవాలన్నారు. ఎలాంటి వాటికి అధిక రుసుము వసూలు చేయరాదన్నారు. అలా తీసుకున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన సేవలన్ని అందించాలన్నారు. మీసేవలో ఏమైన సలహాలు, సూచనలు కోసం టోల్ ఫ్రీ నెంబరు 1400 కాల్ చేయాలన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

చిన్నారులకు వ్యాధినిరోధక టీకాలు

కలకడ : ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న వ్యాధి నిరోధక టీకాలను చిన్నారులకు విధిగా అందించాలని మండలంలోని ఎర్రకోటపల్లె పీహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ జవహర్‌బాబు ఆదేశించారు. బుధవారం మండలంలోని పాపిరెడ్డిగారిపల్లె సచివాలయంలో వ్యాక్సినేషన్ అందిస్తున్న సిబ్బందిని ఆకస్మిక తనిఖీ చేశారు. ఎం.సి.పి.కార్డులను పరిశీలించి నమోదు చేయకుంటే సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలియో చుక్కలు, పెంటవ్యాక్సిన్, టీటీవ్యాక్సిన్, విటమిన్ ఏ సొల్యేషన్ గురించి ముందుగా తెలియజేయాలన్నారు. గర్భిణులకు ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవం సురక్షితమన్నారు. ఎంపీహెచ్‌ఈఓ జయరామయ్య, పీహెచ్ఎన్ సుబ్బరత్న, ఆరోగ్యకార్యకర్త వాణి, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వైభవం.. నృసింహుడి జయంత్యుత్సవం



తరిగొండ వెంగమాంబ ఆలయాన్ని సందర్శించిన పుష్పగిరి పీఠాధిపతి శ్రీశ్రీ విద్యాశంకర స్వామి



విశేషాలంకారంలో తరిగొండ వెంగమాంబ



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

గుర్రంకొండ : మండలంలోని తరిగొండలో మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ 254వ జయంతి, నృసింహస్వామి జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. వెంకటేశ్వరస్వామి ప్రియ భక్తులరాలైన ప్రముఖ రచయిత్రి వెంగమాంబ జన్మస్థలం తరిగొండ గ్రామం. ఇక్కడే లక్ష్మీ నరసింహస్వామివారి ఆలయ ప్రాంగణంలోనే వెంగమాంబ ఆలయం ఉంది. వెంగమాంబ, నరసింహస్వామి జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని బుధవారం ఉదయం 9 గంటలకు స్వామివారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం కావించారు. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య మహాస్నపనం ఘనంగా నిర్వహించారు. 10గంటలకు ఆలయ ప్రాంగణంలో తరిగొండ వెంగమాంబ విగ్రహానికి పుష్పాంజలి కార్యక్రమాలు నిర్వహించారు. వెంగమాంబ ఆలయాన్ని రంగు రంగుల పుష్పాలతో అందంగా అలంకరించారు. అమ్మవారికి పలు రకాల నైవేద్యాలను సమర్పించి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మేళతాళాలతో గ్రామ పురవీధుల గుండా స్వామివార్లకు గ్రామోత్సవం నిర్వహించారు. టీటీడీకి చెందిన అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారుల చేత వెంగమాంబ సంకీర్తన గోష్ఠిగానం, హరికథా కాలక్షేప కార్యక్రమాలు నిర్వహించారు. వెంగమాంబ, నృసింహ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకొని పూజలు నిర్వహించారు. అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

వెంగమాంబ ఆలయాన్ని దర్శించడం మహద్భాగ్యం:
మాతృశ్రీ తరిగొండకు వెంగమాంబ ఆలయాన్ని ఆమె జయంతి రోజునే దర్శించడం మహద్భగ్యమని పుష్పగిరి పీఠాధిపతి శ్రీశ్రీ విద్యాశంకర స్వాములు అన్నారు. బుధవారం మాతృశ్రీ వెంగమాంబ, నరసింహస్వామి జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని మండలంలోని శ్రీ తరిగొండ వెంగమాంబ ఆలయాన్ని ఆయన సందర్శించారు. ఈసందర్భంగా టీటీడీ అధికారులు, అర్చకులు ఆయనకు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. ఈసందర్భంగా వెంగమాంబకు ఘనంగా పుష్పాంజలి ఘటించారు. స్వామివారి స్నపన తిరుమంజనంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆ రోజుల్లో కలియుగ దైవ, శ్రీ వెంకటేశ్వరస్వామిపై వెంగమాంబకున్న అచెంచెల భక్తి విశ్వాసాలు శ్లాఘనీయమన్నారు. అంతటి మహాభక్తురాలు పుట్టిన ఈ ప్రాంతాన్ని సందర్శించుకోవడం మహాదానందంగా ఉందన్నారు. స్వామి అనుగ్రహం పొందిన ఆమె జీతం ఎందరికో ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో టీటీడీ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

వైభవంగా వెంకన్న బ్రహ్మోత్సవాలు

కల్పవృక్షవాహనంపై ఊరేగిన దేవదేవుడు



కల్పవృక్ష వాహనంపై స్వామివారు

మదనపల్లె సిటీ : ప్రసన్న వెంకటరమణస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం స్థానిక దేవళవీధిలోని ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో స్వామిని కల్పవృక్షవాహనం (మోహినీ ఉత్సవం) అలంకరణలో ఆశీనులై భక్తులకు కటాక్షించారు. స్థానిక కొత్తపేట ఉభయదారులుగా వ్యవహరించారు. మేళతాళాలు, వేదమంత్రాలు, వేదపారాయణం నడుమ శ్రీవారు నెహ్రూబజార్, అప్పారావువీధి, ఆర్ ఆర్ వీధి ప్రాంతాల్లో విహరించారు. భక్తులు అడుగడుగునా కర్పూర నీరజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం అర్చకులు గోవర్ధన్‌భట్టార్ స్వామికి అభిషేకం, హోమాలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ ఆవరణంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రమణ, మాజీ చైర్మన్ బింగి పాండు, ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిన్నక్కమ్మ, పెద్దక్కమ్మలకు విశేష పూజలు



విశేషాలంకరణలో చిన్నక్కమ్మదేవి

కేవీపల్లె : మండలంలోని నూతనకాల్వలో వెలసిన శ్రీ చిన్నక్కమ్మ, పెద్దక్కమ్మ జాతరలో భాగంగా బుధవారం అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. బుధవారం ఉయం అమ్మవారికి అభిషేకం, అలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవార్ల ఆలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేశారు. భక్తులు చాందినీ బండ్లతో ఆలయ ప్రదక్షణ నిర్వహించి మొక్కుబడులు చెల్లించారు.

నేటి నుంచి చీనేపల్లె యల్లమ్మ తిరునాల :
మండలంలోని ఎంపీపల్లె పంచాయతీ చీనేపల్లెలో యల్లమ్మ తిరునాల గురువారం నుంచి రెండు రోజుల పాటు జరుగుతుందని అర్చకులు విజయకుమార్ స్వామి తెలిపారు. గురువారం చిన్న యల్లమ్మ, పెద్దయల్లమ్మ అమ్మవార్లకు అభిషేకం, అలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రాత్రి అమ్మవారికి బోనాల సమర్పణ, చాందినీబండ్ల ఊరేగింపు ఉంటాయన్నారు. ఫ్రెండ్లీ వెల్ఫేర్ సర్వీసెస్ ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

గంగమ్మ ఆలయంలో ఎమ్మెల్యే పూజలు



బోదగుంటపల్లెలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

పెద్దమండ్యం : మండలంలోని అవికేనాయక్‌తండాలో వెలసిన గంగమ్మ గుడిలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాధరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. తండావాసులు మంగళవారం రాత్రి గంగమ్మ తిరునాల నిర్వహించారు. ఈ సందర్భంగా తండాకు వచ్చిన ఎమ్మెల్యేకి జిల్లా వైఎస్సార్ సీపీ ఎస్టీసెల్ నాయకులు శ్రీనివాసులునాయక్, ఎంపీటీసీ నాగేశ్వరి, తండావాసులు స్వాగతం పలికారు. అనంతరం బండ్రేవు మీదుగా కలిచెర్లకు బయలుదేరిన ఎమ్మెల్యే మార్గ మధ్యలోని బోదగుంటపల్లెలో గ్రామస్థులతో మాట్లాడారు. అత్యధిక మెజార్టీతో తంబళ్లపల్లె ఎమ్మెల్యేగా రెండవ సారి గెలుస్తారని ప్రజలు ధీమా వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వెంట మాజీ ఎంపీపీ టి రెడ్డిశేఖరరెడ్డి, మాజీ జెడ్పీటీసీ గుర్రం రమేష్, సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీనరసింహుడి కల్యాణం



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న కవితమ్మ

పెద్దమండ్యం : మండలంలోని పాపేపల్లెలో కుషావతీ నది ఒడ్డున వెలసిన లక్ష్మీనరసింహ స్వామి కల్యాణోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. శ్రీలక్ష్మీ నరసింహస్వామి జయంతి సందర్భంగా స్వామివారి కల్యాణోత్సవాన్ని తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాధరెడ్డి సతీమణి కవితమ్మ ఆధ్వర్యంలో జరిపించారు. ఆలయ అర్చకులు ఎమ్మెల్యే సతీమణికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం ఆలయ ఆవరణంలో స్వామివారి కల్యాణోత్సవం వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య వైభవంగా జరిగింది. స్వామివారి కల్యాణానికి గ్రామంలోని భక్తులు, ప్రజలు తరలి వచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ పీరాన్‌బి, ఎంపీటీసీ బోడిమాని గీత, వాటర్‌షెడ్ కమిటీ చైర్మన్ గలా నరసింహులు, భక్తులు పాల్గొన్నారు.

ఉచిత బాడీ ఫ్రీజర్‌ను సద్వినియోగం చేసుకోండి



వాల్మీకిపురం : ఉచిత బాడీ ఫ్రీజర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని మదనపల్లి హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపక అధ్యక్షులు అబూబకర్ సిద్ధిక్ అన్నారు. బుధవారం స్థానిక హెల్పింగ్ మైండ్స్ సిబ్బందికి బాడీ ఫ్రీజర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా చనిపోతే మృతదేహం ఉంచడానికి బాడీ ఫ్రీజర్ బాక్స్ సేవలు ఉచితంగా అందుబాటులో ఉంటుందన్నారు. కుల, మతాలకు అతీతంగా ఉచితంగా సేవలు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో షాహెద్, అషర్, ఇర్ఫాన్, సయ్యద్, కిరణ్, అర్షద్, ఆసీఫ్, భరత్, తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవం

వాల్మీకిపురం : అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవం సందర్భంగా బుధవారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జేవీవీ అధ్యక్షుడు ప్రభ చరణ్ మాట్లాడుతూ మన జీవనశైలిలో పర్యావరణ కాలుష్యం చెందడంతో భూగోళం వేడెక్కిపోయిందన్నారు. దీంతో జీవ వైవిధ్యం దెబ్బతింటోందన్నారు. ప్రపంచంలోని 12 మహా జీవవైవిధ్య ప్రాంతాల్లో భారతదేశం ఒకటని, గతంలో మన దేశంలో 77 వేల జంతు జాతులు ఉండేవని, వాటిలో చాలా జాతులు అంతరించిపోయే దశలో ఉన్నాయన్నారు. అంతరిస్తున్న జీవవైవిధ్యాన్ని పరిరక్షించడం మన అందరి బాధ్యత అని తెలిపారు.

రైతులకు ఉపయోగపడే పనులకు ప్రాధాన్యత

తంబళ్లపల్లె : ఉపాధిహామీ పథకం ద్వారా రైతులకు ఉపయోగపడే పనులకు ప్రాధాన్యత కల్పించాలని ఏపీడీ మధుబాబు తెలిపారు. బుధవారం స్త్రీ శక్తి భవనంలో టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. గ్రామ పంచాయతీల వారిగా జరుగుతున్న పనులు, పాల్గొంటున్న కూలీలు తదితర అంశాలపై ఆరా తీశారు. రైతులకు పండ్లతోటలు, పశుగ్రాసం పెంపకానికి ఆర్థికసాయంపై చైతన్య పరచాలన్నారు. పండ్లతోటలు, పశుగ్రాసం పెంపకం చేపట్టే రైతుల పేర్లు, వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. సమావేశంలో ఏపీవో అంజనప్ప పాల్గొన్నారు.

80 లీటర్ల నాటుసారా స్వాధీనం

వాల్మీకిపురం : అక్రమంగా ఉంచిన 80 లీటర్ల నాటుసారాను సీజ్ చేసినట్లు వాల్మీకిపురం సీఐ పులిశేఖర్ తెలిపారు. బుధవారం మండలంలోని చింతపర్తిలో బిఎస్ఎఫ్ సిబ్బంది, స్థానిక పోలీసులతో కలసి కార్డెన్ సర్చ్ నిర్వహించారు. ఇందులో భాగంగా 80 లీటర్ల నాటుసారాను సీజ్ చేసినట్లు తెలిపారు. జూన్ 4వ తేది వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందని, ఎలాంటి ఘర్షణలు జరిగినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

కేంద్ర బలగాల కవాతు

కురబలకోట : ఎన్నికల కౌంటింగ్ ముంచుకువస్తుండడంతో ముందస్తుగా కేంద్ర బీఎస్ఎఫ్ బలగాలు బుధవారం సాయంత్రం అంగళ్లులో కవాతు నిర్వహించాయి. డీఎస్పీ ప్రసాద రెడ్డి నేతృత్వంలో స్థానిక ఎస్ఐ మల్లిఖార్జున రెడ్డి పర్యవేక్షణలో అంగళ్లు హైవే రోడ్డు పొడవునా పెద్ద ఎత్తున బలగాలతో కవాతు జరిపారు. అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు.

రాయితీ విత్తనాలకు పేర్లు నమోదు చేసుకోవాలి

బి.కొత్తకోట : ప్రభుత్వం అందిస్తున్న రాయితీ వేరుశనగ విత్తనకాయల కోసం రైతులు రైతు భరోసా కేంద్రాల్లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని వ్యవసాయశాఖ ఏఓ చంద్రశేఖర్‌నాయక్ తెలిపారు. ముందుగా విత్తనకాయలకు రాయితీపోను మిగిలిన డబ్బును చెల్లించి టోకెట్ తీసుకోవాలని కోరారు. కే-6, టీసీజీఎస్ రకం కోసం 30 కిలోల బస్తాకు రూ.1,710, కదిరి, లేపాక్షి రకం కోసం రూ.1,566 చెల్లించాలని కోరారు. రిజిస్ట్రేషన్ చేయించుకున్న రైతులు విత్తనకాయలను పంపిణీ చేస్తామని తెలిపారు.

సురక్షిత నీరు.. ఆరోగ్యానికి మేలు

పీలేరు : మనం తాగే నీరు సురక్షితమైతే మనమూ సురక్షితమేనని తలపుల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎం. రమేష్‌రెడ్డి అన్నారు. బుధవారం గాండ్లపల్లెలో 'సురక్షితనీరు – ఆరోగ్యానికి మేలు' అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతికూల వాతావరణం దృశ్యా మనిషికి వ్యాధులులేని జీవితం సాధ్యపడాలంటే సురక్షితమైన నీరు, తాజా ఆహారంతోనే సాధ్యమన్నారు.

దాడికి పాల్పడిన టీడీపీ నాయకులను అరెస్ట్ చేయాలి

పీలేరు : రాయచోటి మార్కెట్ యార్డు చైర్మన్ వండాడి వెంకటేశ్వర్లుపై దాడికి పాల్పడిన టీడీపీ నాయకులను వెంటనే అరెస్ట్ చేయాలని వైఎస్సార్‌సీపీ నాయీ బ్రాహ్మణ నాయకులు ఆనందబాబు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ వండాడి వెంకటేశ్వర్లు ఒక నాయకుడి ఎదుగుతూ పేదలకు చేదోడువాదోడుగా ఉండడం ఓర్వలేక టీడీపీ రౌడీ మూకలు ఆయనపై దాడి చేయడం తోపాటు ఆస్తి నష్టం కల్గించారన్నారు. సీసీ ఫుటేజీలు పరిశీలించి దాడికి పాల్పడిన వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

మదనపల్లె సిటీ : ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించి వారి నుంచి మన్ననలు పొందాలని మదనపల్లె ఆర్టీసీ డిఎం మూరే వెంకటరమణారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ఆర్టీసీ-1,2 పరిధిలో డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించారు. ప్రయాణికుల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వన్ డిపో పరిధిలో మదనపల్లె-బెంగుళూరు వయా మార్తహలిల మీదుగా బస్సు నడపాలని, బెంగళూరు నుంచి మదనపల్లెకు సాయంత్రం 6 గంటల తరువాత బస్సు సౌకర్యం కల్పించాలని పలువురు కోరారు. అంతరాష్ట్ర పర్మిట్లు అవసరం ఉన్నందున ఉన్నతాధికారులకు తెలియజేసి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. మదనపల్లె నుంచి ఎన్పీ కుంటకు వెళుతున్న బస్సును వయా దండువారిపల్లె మీదుగా నడపాలని కోరారు. మదనపల్లె నుంచి హైదరబాదు బస్సులు బురకాయలకోట ఊరిలో వెళ్లాలని, రిక్వెస్ట్ స్టాప్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ విషయంపై హైదరాబాదు వెళ్లే బస్సు డ్రైవర్లును పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. టు డిపో రామసముద్రం మీదుగా కోటిలింగాలకు కొత్త బస్సు సర్వీసు నడపాలని కోరారు. ఇంటర్ సేట్ట్ పర్మిట్, కర్ణాటక ప్రభుత్వం అనుమతి అవసరం కనుక నడపడానికి వీలుకాదని తెలిపారు. వాయల్పాడు-రంగనాథపురం మీదుగా కలకడ నడుపుతున్న సర్వీసు బస్సు డిస్టినేషన్ బోర్డు పెద్దగా కనిపించేలా ఉంచాలని, మదనపల్లె నుంచి కలకడ వెళునప్పుడు వాల్మీకిపురం బస్‌స్టేషన్‌లో కొంతసేపు ఆపాలని కోరారు.

పవిత్ర ప్రయాణం

– హజ్ యాత్రికులకు వీడ్కోలు



హజ్ యాత్రలకు వీడ్కోలు పలుకుతున్న హాఫీజ్‌సాహెబ్ జలాలుద్దీన్

మదనపల్లె సిటీ : హజ్.. ఇస్లాం సూచించిన ఐదు మూల సూత్రాల్లో ఐదో సూత్రం. ఆర్థిక స్థోమత కలిగిన ప్రతి ముస్లిం తన జీవితకాలంలో ఒక్కసారైనా పవిత్ర మక్కా, మదీనా పుణ్యక్షేత్రాలను సందర్శించాలని ఇస్లాం ప్రబోధిస్తుంది. ఇందులో భాగంగా బుధవారం ఉదయం మదనపల్లె పరిసర ప్రాంతాల నుంచి 140 మంది హజ్‌యాత్రకు బయలుదేరారు. వీరు మదనపల్లె నుంచి బస్సులో బెంగళూరుకు బయలుదేరి వెళ్లారు. మొదట స్థానిక జామియా మసీదులో నమాజ్ అనంతరం హజ్ యాత్రికులకు వీరి కుటుంబీకులు, ముస్లిం పెద్దలు వీడ్కోలు పలికారు. ముఫ్తీ షాజహాన్, జామియా మసీదు హాఫీజ్‌సాబ్ జలాలుద్దీన్‌సాహెబ్, రఫీక్‌బేగ్, గౌస్, మోహిద్దీన్, డిష్ ప్యారూ తదితరులు పాల్గొన్నారు.

ఓటింగ్‌పై ఆసక్తి చూపని ఓటర్లు

- పెరిగి..తగ్గిన ఓటింగ్ శాతం
- 2024లో 81.81 శాతం పోలింగ్

బి.కొత్తకోట : తంబళ్లపల్లె నియోజకవర్గ ఓటర్లు ఓటింగ్‌పై ఆసక్తి కనిపించలేదని తెలుస్తోంది. గత మూడు అసెంబ్లీ ఎన్నికల ఓటింగ్ తీరును పరిశీలిస్తే..

2014 అసెంబ్లీ ఎన్నికల్లో తంబళ్లపల్లె నియోజకవర్గంలో 1,99,084 మంది ఓటర్లు ఉండగా, 1,62,401 ఓట్లు పోలయ్యాయి. ఇందులో స్త్రీలు 80,358 మంది, పురుషులు 82,043 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. 36,683 మంది ఓటర్లు తమ ఓటుహక్కు వినియోగించుకోలేదు. ఈ ఎన్నికలో 81.81 శాతం పోలింగ్ నమోదైంది. 2019 ఏప్రిల్ 11న జరిగిన ఎన్నికల తీరును పరిశీలిస్తే..నియోజకవర్గంలో మొత్తం 2,09,834 మంది ఓటర్లుండగా, స్త్రీలు 1,05,151 మంది, పురుషులు 1,04,670 మంది ఓటర్లున్నారు. ఈ ఎన్నికల్లో స్త్రీలు 87,895 మంది మాత్రమే ఓటు హక్కు వినియోగించుకోగా 17,256 మంది స్త్రీలు ఓటు వేయలేదు. పురుష ఓటర్లలో 89,068 మంది ఓటును వినియోగించుకొన్నారు. ఇందులో స్త్రీల ఓటింగ్ శాతం 83.6 శాతం కాగా పురుషుల ఓటింగ్ శాతం 85.1 శాతం. ట్రాన్స్‌జెండర్లకు 13 ఓట్లు ఉండగా ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోలేదు. 2014 ఎన్నికల కంటే 2.49 శాతం అదనంగా 2019లో పోలింగ్ 84.3 శాతానికి పెరిగింది. కాగా ప్రస్తుత 2024 ఎన్నికల్లో 2,24,802 ఓటర్లుండగా అందులో స్త్రీలు 1,14,163 మంది, పురుషులు 1,10,627 మంది ఉన్నారు. 13న జరిగిన ఎన్నికల్లో స్త్రీలు 93,920 మంది, పురుషులు 92,970 మంది,ట్రాన్స్‌జెండర్లు నలుగురు ఓటు హక్కును వినియోగించు కున్నారు. ఈ ఎన్నికల్లో 37,894 మంది ఓటుకు దూరంగా ఉండిపోయారు. ఓటర్ల సంఖ్య ఐదేళ్లకోసారి పెరుగుతూ వస్తున్నా, ఓటింగ్ తీరులో మార్పు కనిపిస్తోంది. ఓటుహక్కును సద్వినియోగం చేసుకునే విషయంలో అవగాహన పెరగాల్సి ఉంది.

వేరుశనగ విత్తన కాయలు పంపిణీకి సిద్ధం



గుర్రంకొండలోని ఆర్బీకేకు చేరుకొన్న సబ్సిడీ వేరుశనగ విత్తన కాయలు

గుర్రంకొండ : మండలంలోని 13 ఆర్బీకే కేంద్రాలకు ప్రభుత్వం సరఫరా చేసిన సబ్సిడీ వేరుశనగ విత్తన కాయలు చేరుకొన్నాయి. బుధవారం మండలంలోని ఆయా గ్రామ పంచాయతీల్లోని ఆర్బీకేలకు ముందుగా కేటాయించిన విధంగా విత్తనకాయల బస్తాలను వాహనాల ద్వారా జిల్లా కేంద్రం నుంచి సరఫరా చేశారు. మండలం మొత్తానికి 2024 ఖరీఫ్ సీజన్‌కు గాను మొత్తం 1300 క్వింటాళ్ల వేరుశనగ విత్తన కాయలను కేటాయించారు. ఇందులో టీ సీజీఎస్ 1694 రకం విత్తన కాయలు 250 క్వింటాళ్లు, కే-6 రకం 250 క్వింటాళ్లు, నారాయణి రకం 800 క్వింటాళ్ల విత్తనకాయలు సరఫరా అయినట్లు ఇన్‌చార్జ్ ఏవో నవీన్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువారం నుంచి ఆయా గ్రామాల్లోని ఆర్బీకేల్లో వ్యవసాయశాఖ సిబ్బంది ద్వారా ఆన్‌లైన్‌లో రైతులు తమకు కావాల్సిన విత్తనకాయలు నమోదు చేసుకోవాలన్నారు. అలాగే మండలానికి జనుము విత్తనాలు 100 క్వింటాళ్లు, జీలుగ విత్తనాలు 140 క్వింటాళ్లు 13 ఆర్బీకేలకు సరఫరా చేశామన్నారు. రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నాణ్యమైన విత్తనాలు అందించడమే లక్ష్యం

జిల్లా వ్యవసాయశాఖఅధికారిచంద్రనాయక్



వేరుశనగ విత్తనాలను పరిశీలిస్తున్న డీఏఓ

కలకడ : రైతులకు రాయితీపై నాణ్యమైన విత్తనాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యంగా ముందస్తు విత్తణ సేకరణకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా వ్యావసాయశాఖ అధికారి (డీఏఓ)బి.చంద్రనాయక్ అన్నారు. బుధవారం కలకడలోని వేరుశనగ విత్తనశుద్ధి కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసి విత్తన శుద్ధిని పరిశీలించారు. స్థానికంగా, బయటి నుంచి వేరుశనగ విత్తన కాయలు కొనుగోలు చేయడానికి ప్రభుత్వ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వేరుశనగ విత్తన శుద్ధి కేంద్రాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. వచ్చే ఖరీఫ్ సీజన్‌కు రైతుల సాగుకు తక్కువ రాకుండా ముందస్తు ప్రణాళిక ప్రకారం సేకరించడం జరుగుతుందన్నారు.